
# మాతృవియోగం

## బెంగాలీ మూలం: శుభ్రాసన్యాల్

## తెలుగు అనువాదం: డా॥ పుట్టపర్తి నాగపద్మిని

పదకొండు గంటలు దాటి నలభై నిముషాలకు, మా అమ్మ ఎలక్ట్రిక్ పొయ్యిలోకి వెళ్ళిపోయింది. శ్మశాన వాటికలో పనిచేసే పురోహితుడు చెప్పినట్టే, నెయ్యి వేయటం, పిండ ప్రదానం, అగ్నిచుట్టూ తిరగడం, అంత్యక్రియలకు సంబంధించిన పనులన్నీ శాంతంగా చేసుకుంటూ వెళ్లాను.

మా అన్నయ్య, వదినె, పెదనాన్న, యింకా శ్మశానంలోని వాళ్ళ దృష్టంతా నా చుట్టూతా తిరగటం – నేను గమనిస్తూనే వున్నాను. నిజానికి యీ క్షణంలో నేను ఒక్కసారిగా ఏడుస్తానని వాళ్ళంతా అనుకుని వుండ వచ్చు. కానీ నాకు ఏడుపే రావటం లేదు. 'ఆడపిల్ల యీ పనులన్నీ చేయటమేంటి?' 'పది రోజులు మైల పాటించాల్సిందే!' యిలా చుట్టుపక్కల వాళ్లంతా మాట్లాడుకుంటూనే వున్నారు. నాకు దూరపు చుట్టం – మరో అన్నయ్య, వదినా అంటున్నారు – 'పెళ్లయిన కూతురు కదా! మూడు రోజుల్లోనే అన్ని పనులూ అయిపోవాలి, తనకి మూడు రోజులేగా మైల మరీ!' అని. మళ్ళీ మాటలు.



'ఈ ఖర్చులన్నీ ఎవరు పెట్టుకోవాలి? తన దగ్గర డబ్బెంత వుందో?'' ఇలా.. ఇప్పటిదాకా ఖర్చంతా నేనే పెట్టుకున్నాను. ఇంకా జరగవలసిన కార్యక్రమానికి చాలానే అవుతుంది. దశాహ్ని రోజున ఎంత ఖర్చు తగ్గించాలనుకున్నా, దగ్గరి బంధువులు, ఆత్మీయులు, యిరుగుపొరుగు వాళ్ల, యిలా అందరినీ పిలవాలా? కుటుంబ మర్యాద అంటూ ఒకటుంది కదా!

చిన్నవదినె అంటూంది – ''మూడు రోజుల్లోనే ముగిస్తే మంచిది బాబూ! పది రోజులంటే మహాకష్టం. తిండితిప్పల్లో అంటూ అవీ వున్నాయి మరి! అదీకాక తనతో ఎవరికి పడుతుంది కనుక? ఎవరి మాటైనా వింటుందా ఏమన్నానా?''

ఎంత గొంతు తగ్గించి మాట్లాడుతున్నా, నాకా మాటలన్నీ వినిపిస్తూనే వున్నాయి. అయినా, నిర్వికారంగా గంగాతీరాన, స్మశాన వాటికను చూస్తూ నిలబడ్డాను.

ఒకటి రెండు గంటల్లో పనంతా అయిపోయింది. నేను చాలా మంచి బట్టలు వేసుకుని వున్నాను, కానీ వాటిని వదిలివేయాల్సి వచ్చింది. చాలా బాధనిపించింది. నిజానికి నిన్న ఆఫీసు నుంచి తిరిగి వచ్చిన తరువాత బట్టలు మార్చుకోలేకపోయాను. రాగానే అమ్మతో తర్కవితర్కాలు మొదలయ్యాయి. కోపంలో యిద్దరూ ఆవేశం పట్టలేకపోయాం. ఉన్నట్టుండి అమ్మకు వాంతి రావటం మొదలైంది. ముఖమంతా ఎర్రగా మారింది. నాకు భయం వేసింది. అమ్మను తొందరగా సోఫాపై పడుకోబెట్టి, చల్లని నీళ్లతో ముఖం తుడిచాను. అమ్మ మెల్లిగా సోఫాపైనే పడుకుంది. తన ముఖం వంకరపోయింది. తడబడుతూనే అంది – ఎవరినైనా పిలవమని! మళ్ళీ ఓసారి వాంతి చేసుకుంది. ఇలాంటి పరిస్థితిలో ఆమెను ఒంటరిగా వదిలి బైటికెలా వెళ్ళేది! కాసేపైన తరువాత నేను తాపసి యింటికెళ్లాను. నేనింట్లో లేకపోతే, అమ్మ వాళ్లింట్లోనే ఎక్కువసేపు వుంటుంది. తాపసిని అమ్మ దగ్గరుంచి నేను మా పినతండ్రి కొడుకుల దగ్గరికి వెళ్లాను. మేమంతా దగ్గర దగ్గర యిళ్లలోనే వుంటాము. చలి పెరుగుతూ వుంది. అందరి తలుపులూ మూసి వున్నాయి. రాత్రి పది గంటలైపోయింది. ఒకరు అప్పటికే నిద్రపోయారు. యింకోరు భోజనానికి కూర్చున్నారు అప్పుడే! మరొకరు యింకా యింటికి రానేలేదు. ఇటీవల నేను వాళ్లెవరితోనూ మాట్లాడలేదు. నన్ను చూసి అందరూ ఆశ్చర్యపో

యారు. అమ్మ గురించి యెంత చెప్పగలనో అంతా చెప్పి యింటికి వచ్చేశాను. డాక్టర్‌కు ఫోన్ చేశాను. టాలీగంజ్‌కీ, మానిక్ తల్లా పిన్నికీ కూడా చేశాను. అన్నదమ్ములంతా వచ్చేస్తున్నామనే అన్నారు కానీ మాటల్లో ఆ బాధ కనిపించలేదు మరి! అప్పటికి అమ్మకు మరోసారి వాంతి అయింది. గురకలాంటి శబ్దం వస్తూంది. తెలివితప్పి పడివుంది. చుట్టుపక్కల వాళ్లంతా వచ్చేశారు. సోనా పెద్దమ్మ – చిన్నవదినెతో అంటూంది. 'ఇలాంటి శబ్దం వస్తే యిక అయిపోయినట్టే' అని! రకరకాల మనుషులు – రకరకాల మాటలు! డాక్టర్ వచ్చేటప్పటికి, అమ్మ మరింత డీలా పడిపోయింది. డాక్టర్ చెకప్ చేసి, యింజక్షన్ యిచ్చి గంభీరంగా అన్నయ్యలతో అంటున్నారు – 'సెరిబ్రల్ అటాక్.. కండిషన్ బాగాలేదు. హాస్పిటల్‌లో చేర్పించవచ్చు కానీ పెద్ద లాభమేమీ వుండదేమో! పైగా యీ పరిస్థితిలో అటూయిటూ కదిలించటమూ మంచిది కాదు!' అని. ఫీజ్ యివ్వబోతే తీసుకోలేదు. మంచి మనిషి! మమ్మల్ని చూసి 'అనవసరంగా ఖర్చుపెట్టటం – నాకు యిబ్బంది' అని గ్రహించారు!

ఒకరికి మందు తాగాలని గుర్తుకొస్తే, మరొకరికి అత్యవసరంగా ఫోన్ చేయాలని గుర్తొచ్చింది. ఏదో వంకన అందరూ జారుకున్నారు. ఈ చలిరాత్రిలో, చావబోతున్న ఒక మనిషికి తోడుగా నిలవాలని ఎవరికనిపిస్తుంది? నేనెవరిని అనగలను? అత్తగారి యింటితో అమ్మ ఏనాడూ సరిగాలేదు. అమ్మ పెంపకంలో పెరగటం వల్ల, నేనూ పొగరుగానే వుండేదాన్ని! బురదలో చిక్కుకున్నప్పుడు, అందరినీ పిలిస్తే లాభమేంటి? అయినా, అందరూ వచ్చి సాయపడాలని ప్రయత్నిస్తూనే వున్నారు. ఇదే ఎక్కువ! తాపసీ వాళ్ల అమ్మమాత్రం అంది – 'తలుపు వేయకు! నేనిప్పుడే వస్తాను! నీవేమైనా తిన్నావా అసలు?'

'తిన్నాను' అని అన్నానే కానీ ఎప్పుడు? ఆఫీస్ నుంచి రావటం ఆలస్యమైంది! తలుపు తెరవగానే అమ్మ 'ఎక్కడికెళ్లావ్?' అంది!

'మా ఆఫీసతను ఆస్పత్రిలో వున్నాడు. అతన్ని చూసేందుకెళ్లాను'.

'ఎవరతను? అంతదూరం ఒంటరిగానే వెళ్ళావా?'

'ఊహూ.. తస్లీమ్ కారులో వెళ్లా!'

'ఆహా! నీ యిల్లు తగులబెట్టుకుని, నీ కులం మంటగలుపుకుని, యిప్పుడిలా తైతక్కలాడుతున్నావన్నమాట!'

ఈలోపల అమ్మ మాట్లాడే పద్ధతి పూర్తిగా చెడిపోయింది. నాపై ఎప్పుడూ అనుమానమే! నా, బుర్ర వేడెక్కిపోయింది. 'నేను నా యిల్లు తగులబెట్టుకున్నానా? నన్నసలు కాపురం చేసుకోనిచ్చావా? ఊరించి ఊరించి యిలా చంపేశావ్ కదా! ఓ తల్లివై వుండికూడా పాలుతాగే పిల్లను వదిలి వచ్చేలా చేశావు నన్ను! ఎటూ కాకుండా చేశావు!'

అమ్మ వణికిపోతూ అంది – 'నీ మంచికోసమే చేశా! కానీ నువ్వు?'

'ఇంతకంటే యింకేం చేయనవసరం లేదులే! నా సంపాదన తింటున్నావ్! నీ మాట నేను విననవసరం లేదు. ఎవరితో యిష్టమైతే, వాళ్లతో తిరుగుతానంతే!'

'నువ్వు.. నువ్వు... నన్ను?'

కోపంతో నాకసలు స్పృహేలేదు. అమ్మ మాటలేవీ నా చెవుల్లో పడటమే మానేశాయి. ఇంతలో ఫోన్ మోగింది. తీరా వెళ్లి చూస్తే, రాంగ్ నెంబర్... మళ్లీ

'నేను నా యిల్లు తగులబెట్టుకున్నానా? నన్నసలు కాపురం చేసుకోనిచ్చావా? ఊరించి ఊరించి యిలా చంపేశావ్ కదా! ఓ తల్లివై వుండికూడా పాలుతాగే పిల్లను వదిలి వచ్చేలా చేశావు నన్ను! ఎటూ కాకుండా చేశావు!'

వచ్చి చూసేసరికి అమ్మ వాంతి చేసుకుంది. ఆ తరువాత యిదంతా...

అమ్మ యింకా నిద్రపోతూనే వుంది. మధ్యమధ్య గురకలు.. వాంతిలో నల్లటి పదార్థమేదో వస్తూనే వుంది. వంటింట్లోకి వెళ్లి చూస్తే – డైనింగ్ టేబుల్ మీద ఓ చిన్నగిన్నెలో ఆలూ – కాలీఫ్లవర్ కర్రీ, మరో కటోరీలో ఉడికించిన చేపముక్క, గిన్నెలో కాచిన పాలు.. కేసరోల్‌లో రొట్టె వుంది. మూత తెరిచి రొట్టె చేతిలోకి తీసుకున్నా. మళ్లీ పెట్టేశా! తినాలనిపించలేదు. ఈ పరిస్థితిలో అమ్మకు పెట్టటం కూడా మంచిదికాదు. వున్నట్టుండి గుర్తొచ్చింది – క్యారీబ్యాగ్‌లో ఒక ప్లేట్ పనీర్, బటర్ మసాలా తెచ్చాను వచ్చేటప్పుడు! రోజూ ఒకేరకం తిండిగా! అమ్మకు కూడా బాగుంటుందని! పేకెట్ విప్పగానే గుప్పుమని వచ్చిన చెడువాసనకు తల దిమ్మెక్కింది! డస్ట్‌బిన్‌లో పడేసి, లైటార్పి, గదిలోకి వచ్చాను. అమ్మ అలాగే పడివుంది.

కాసేపటి తరువాత తాపసీ వాళ్ల అమ్మ వచ్చింది. వస్తూనే బడబడా మాట్లాడడం మొదలెట్టింది. ''ఇంతలో ఎలా అయిపోయింది? సాయంత్రం మా యింట్లోనే ఎంతసేపుంది? రీటా కొడుకును ఎంత గారాం చేసింది? మరి యిప్పుడిలా జరిగింది! ఎప్పుడూ నీ గురించే ఆలోచన! కొంచెం సేపవగానే బైటికి – యింట్లోకి తిరగడం మొదలెట్టేది! మేమంటూనే వుంటాం – 'అంత గాభరాపడతావెందుకు? వచ్చేస్తుందిలే' అని. 'తనూకు ఏమైనా జరిగితే, నేను పిచ్చిదాన్నైపోతాను. అప్పుడు మా గతేంటని' అంటూ వుండేది.''

నాకిదంతా యిబ్బందిగా వుంది. 'పిన్ని గారూ! మీరు పడుకోండి! నేను మేలుకునే వుంటానుగా! అవసరమైతే మిమ్మల్ని లేపుతానులెండి' అన్నాను.

'సరేలే! నాకిప్పుడే నిద్రపడుతుందా! నీవు భయపడకు. నేను మేల్కొనే వుంటాగా!' ఐదు నిమిషాల్లోనే తాపసీ వాళ్లమ్మ గుర్రుపెట్టి నిద్రపోయింది. నాకు నవ్వొచ్చింది. రోజంతా పనిచేసి చేసి, యిప్పుడు యింకేం చేయగలదు పాపం! అయినా వచ్చింది కదా!

అమ్మ తలపై మెల్లిమెల్లిగా నిమరసాగాను. ఇదేం వింత పరిస్థితి? వయసు వచ్చినట్టు, నిద్ర వచ్చినట్టు, ప్రేమ పుట్టినట్టు, కల వచ్చినట్టు – మృత్యువూ వస్తుంది. సహజంగా! అమ్మ తన జీవితంలో ఏం కావాలనుకుంది? అమ్మ, నాన్న – దాంపత్య జీవితమంతా – దెబ్బలాటలు, అశాంతిగానే నిలిచింది... నా జ్ఞాపకాల్లో. అమ్మ ఎప్పుడూ, పెదనాన్న, సమీర్ చిన్నాన్నలతో నాన్నను పోలుస్తూ మాట్లాడేది! ముందంతా నాన్న ముభావంగానే వున్నా, ఆ తరువాత కోపగించటం మొదలెట్టారు. నాన్న చనిపోయిన రోజు నేను స్కూల్లో వున్నాను. నన్ను, నాన్న ఫ్రెండ్ సమీర్ చిన్నాన్నే స్కూలు నుంచి యింటికి తీసుకొచ్చారు. యింటికొచ్చేసరికి... యింటి ముందంతా జనం... పాడెను పూలతో అలంకరిస్తున్నారు. ఇదంతా చూస్తుంటే, నాకు ఏడుపొచ్చింది. పరుగెత్తుకెళ్లి లోపల చూస్తే, నాన్న కళ్ళు మూసుకుని పడుకుని వున్నారు. అందరి కళ్లల్లో నీళ్ళు... అమ్మ మోకాళ్లపై తలపెట్టుకుని ఏడుస్తూ వుంది. నేను తన దగ్గరికెళ్లి ఏడ్చేశాను – 'అమ్మా! నాన్నకేమైంది?' అంటూ!

విశ్వసించు-
విజయాన్ని పొందు

తెలుగు/హిందీ/
ఆంగ్లంలో లభించే
ఉచిత పుస్తకానికై
నేడే మాకు వ్రాయండి.

అబండెంట్ లైఫ్ రిసోర్సెస్
పోస్ట్ బ్యాగ్ నెం. 24.
సికింద్రాబాద్ - 500 026.

అమ్మ మరింత గట్టిగా ఏడవటం మొదలెట్టింది. పిన్ని చేయిపట్టుకుని నాన్న దగ్గరికి తీసుకెళ్ళింది – 'మీ నాన్నను చివరిసారిగా చూసుకోవే పిచ్చిపిల్లా' అంటూ.

అప్పటిదాకా మరణం గురించి నాకంత పెద్దగా తెలీదు. తరువాత తెలిసింది. మామూలు జ్వరానికి కూడా, చాలా తీవ్రమైన మందు తనంత తానే నాన్న తీసుకున్నారట! దాంతో హార్ట్‌ఎటాక్ వచ్చిందట!

నాన్న చనిపోవటంతో, నేను పూర్తిగా అమ్మ అధీనంలోకి వచ్చేశాను. అమ్మ ట్రైనింగ్ వల్లే, మూడు సార్లు నేను స్కూలు మారాల్సి వచ్చింది. చాలా కష్టం మీద, ఐ.ఎస్.సి. పాసయ్యాను. చిన్నప్పటినుంచే 'మా నాన్నవైపు వాళ్లందరూ చెడ్డవాళ్లనీ, మా శత్రువులనీ, ఏమాత్రం అవకాశం చిక్కినా, మమ్మల్ని విషంపెట్టి చంపెయ్యగలర'నీ అమ్మ చెబుతూనే వుండేది. నా స్కూల్ చదువంతా ఒకసారి సాల్‌కియాలోని మా యింట్లో, లేదా టాలీగంజ్‌లోని మా అమ్మ అక్కయ్య యింట్లోనే కొనసాగింది. మా పెద్దమ్మ చాలా మంచిది. కాని ఆర్థరైటిస్ వల్ల సరిగా తిరగ్గలిగేది కాదు. నాకు నిద్రపట్టని రాత్రి అమ్మకోసం వెతుక్కుంటే – అమ్మ, పెదనాన్నతో – డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని కనిపించేది. ఒక్కోసారి అమ్మ, పెదనాన్న తల పడుతూనో, మరోసారి పెదనాన్న అమ్మ వీపు నిమురుతూనో – కనిపించేవారు. యిలా చూసినప్పుడల్లా నాకు చాలా కోపం వచ్చేది. నాన్నను తలచుకుంటే ఏడుపొచ్చేది. సాల్‌కియాకు వచ్చేద్దామనిపించేది. ఐదు సంవత్సరాలైపోయాయి. పిన్ని చనిపోయింది. చిన్నాన్న కూడా ముసలాయనైపోయారు. ఇప్పుడిక రాకపోకలు లేవు.

మా అమ్మ నన్ను డబ్బున్న వాళ్ళమ్మాయిలాగే పెంచింది. పేపర్లో ప్రకటన చూసి గొప్ప యింటి సంబంధమే చేసింది నాకు. శౌభిక్ మంచి వ్యక్తి. వాళ్ళ యింటివాళ్ళు కూడా మంచివాళ్ళే. శౌభిక్ ముఖం, వ్యక్తిత్వం, గట్టితనం – యివన్నీ నన్ను ముగ్ధురాలిని చేశాయి. నా ముఖం – మా నాన్నగారిలాగే వుంటుంది. చాలా ముద్దుగా వుంటానని ఆయనెప్పుడూ అంటూ వుండేవారు. నేను చాలా అందంగా వుంటానట! ఈ మాటలన్నీ పదేపదే వినటం వల్లనేనేమో, నాలో గర్వం పెరిగింది. ఎంతోమంది అబ్బాయిలను స్కూల్లో వున్నప్పటిరోజుల్లోనే నా చుట్టూతా తిప్పుకునేదాన్ని! ప్రేమించే ఔదార్యం, సహనం నాలో లేనేలేవు. శౌభిక్ యింట్లోనూ, నా అందచందాలతో అందరినీ వేళ్లపై ఆడించవచ్చుననుకున్నాను. కానీ శౌభిక్, చాలా దృఢమైన లోహపదార్థంతో తయారైన వ్యక్తి. అతని సాన్నిహిత్యంలో నా ఆత్మశుద్ధి జరగనారంభించింది. నేనేమిటో నాకు అర్థమవటం మొదలైంది. నన్ను నేను సరిదిద్దుకోనారంభించాను. కానీ నేనిలా తయారవటం – మా అమ్మకు రుచించలేదు.

అమ్మ నోటినుంచి రసం లాగా, నల్లటి పదార్థం వస్తూంది. నేను తుడిచేశాను. నాదెంతటి పాషాణ హృదయం? ఉన్న ఒక్కతోడూ వెళ్ళిపోతూంది. అయినా, నాలో ఏ చలనమూ లేదు. గురకలాగా, అమ్మ నోటినుంచి వెలువడుతున్న శబ్దమూ తగ్గిపోతూ వుంది. అమ్మ తలపై, ఛాతీపై రాయటం మొదలెట్టాను – కాస్త నెమ్మదినిస్తుందేమోనని! కానీ హఠాత్తుగా అమ్మ శరీరం కదిలింది. ఒక్కసారిగా విరుచుకుపడినట్టయి చలనం ఆగిపోయింది. శరీరంలో ఎక్కడా కదలిక లేదు. అమ్మ శరీరాన్ని దుప్పటితో కప్పేశాను. తాపసీ వాళ్లమ్మ గాఢనిద్రలో వుంది. చేసేదేమీ లేక తడి టవల్‌తో అమ్మ ముఖం తుడిచాను. దువ్వెనతో వెంట్రుకలు సరిచేశాను. అమ్మకు నన్ను చూస్తే ఈర్ష్యేమో! అన్నీ వుండికూడా తన యిల్లు వాకిలీ చేసుకోలేకపోవటం వల్లే – నన్నూ వీటన్నింటి నుంచీ దూరం చేయాలనుకుందా? నన్ను అత్తగారింట్లో వదిలిపెట్టిన రోజు ఎంత వింతగా ప్రవర్తించిందో! అందంగా పూలతో అలంకరించిన యిల్లు. పడక... రాత్రి ఆ గది నుంచి వెళ్లనంటే వెళ్లనంటుంది. 'తాన్యా, నేను లేకపోతే నిద్రపోలేద'ని ఒకటే మంకుపట్టు. అమ్మ మాటలు విన్నవాళ్లంతా ఒకటే నవ్వు. వెటకారం. విసుర్లు. చివరికి పెదనాన్నే అమ్మను ఒప్పించి, చేయి పట్టుకుని పక్కకు తీసుకెళ్ళారు. నేను సిగ్గుతో చితికిపోయాను.

శౌభిక్ వైపు కళ్ళెత్తి చూడలేకపోయాను. చాలాసేపటి నిరీక్షణ తరువాత, చప్పగా చల్లారిపోయిన టీ

శౌభిక్ యింటివాళ్ళంతా బాగా చదువుకున్నవాళ్ళు. మర్యాదస్తులు. అంతకుమించి ఉదార స్వభావం గలవాళ్ళు. నాపై దయ చూపించి, క్షమించగలవాళ్ళు కూడా! కానీ ఒకటిన్నర సంవత్సరం కూతురిని విసిరేసి వచ్చానే! ఇప్పుడు ఆరేళ్ళుంటాయి. తన ముందెలా నిలబడగలను?

లాగా, మా మొదటి ముద్దు రుచిలేకుండా...! హనీమూన్‌కు వెళ్ళేందుకు బయలుదేరుతున్నప్పుడు కూడా, హౌరా స్టేషన్లో అమ్మలో తీరని కోరికను గుర్తించాను. మా అత్తగారింటికి అమ్మ తరచూ వచ్చేది. ఆమె ముందర, అంతా బాగానే వున్నా, ఎవరూ ఆమె అంటే యిష్టపడేవారే కాదు. రోజూ మూడు నాలుగుసార్లు తానే ఫోన్ చేసేది. నన్నూ చేయమనేది. చేయకపోతే కోపగించుకునేది. పొద్దున్నే అమ్మ ఫోన్ వచ్చిందంటే చాలు, మనసంతా చీకటితో నిండిపోయినట్టయ్యేది. అమ్మ ప్రవర్తనతో నాకు తెగ చిరాకేసేది. చిన్నప్పటినుంచీ వున్న తలబిరుసుతనం యింకా పెరిగింది. 'రుపాయి' పుట్టిన తరువాత వాతావరణం మరీ చెడిపోయింది. రుపాయి పనులలో మునిగి అమ్మకోసం సమయం కేటాయించలేకపోయేదాన్ని. అమ్మకు కోపం వచ్చేసేది. శౌభిక్ తన చేతిలో కీలుబొమ్మ కావాలని అమ్మ కోరుకునేది. కానీ శౌభిక్ అలాంటివాడు కాదు.

నాకు పిచ్చిపట్టిందా ఏమిటి? డాక్టరింకా డెత్ సర్టిఫికెట్ యివ్వనేలేదు. నేను అమ్మ శరీరానికి చందనం రాయటం మొదలెట్టాను. నేను మనిషినో లేక దయ్యాన్నో నాకే అర్థం కావడం లేదు. అమ్మ తెలిసీతెలియని మనస్తత్వానికి నేనూ వంతపాడాను. 'తల్లీ, కూతురూ – యిద్దరూ రోగపీడితులే! యిద్దరికీ వైద్యం చేయించాలి' అని శౌభిక్ వాళ్ళ నాన్నగారు అననే అన్నారు! కానీ ఆయన్ని మేమిద్దరమూ ఎంతగా అవమానపరిచాం! రుపాయి రక్తం పంచుకుపుట్టిన నా బిడ్డ. కానీ తనని వదిలిపెట్టి నేనెలా వచ్చేశాను? తన ముద్దుముద్దు మాటలు, నవ్వటం – ఏడ్వటం, నాతో ఆడుకోకుండా పడుకునేదే కాదే! యివన్నీ నేనెలా మరిచిపోగలిగాను?

మనస్సు బరువెక్కిపోతూ వుంది. లేచి రేడియో ఆన్ చేశాను. శహనాయీపై, ఆహిర్ భైరవ్ వినిపిస్తూ వుంది. పొగమంచుతో నిండిన శీతాకాలపు తెల్లవారుఝామున, చల్లని శవాన్ని పక్కన పెట్టుకుని, నేనే రాగాలాపనలో మునిగిపోయి వున్నాను?

తెల్లవారగానే, దగ్గరి బంధువులతో, శవయాత్ర ఆర్భాటంగా బయలుదేరింది. ఎంతోమంది ఏడుస్తూ, తమ బాధను తెలియబరుస్తున్నారు. చనిపోయిన వారందరిలాగే, మా అమ్మ ఒక్కసారిగా గొప్పవాళ్ళలో చేరిపోయింది. శ్మశానం నుంచీ తిరిగి వచ్చిన తరువాత, బంధువులంతా జట్లు జట్లుగా, జరగవలసిన కార్యక్రమాన్ని గురించి చర్చిస్తున్నారు. ఎలా చేయాలి? బాధ్యత ఎవరు వహిస్తారు? అటూయిటూ తిరిగి చివరికి, యిక నేను, శౌభిక్ యింటికి వెళ్ళాలన్న నిర్ణయం దగ్గరే అందరి మాటలు ఆగిపోతున్నాయి. నేనే పరిస్థితుల్లో అక్కడినుంచి వచ్చేశానో వీళ్ళందరికీ తెలుసును. మా యిద్దరికీ విడాకులైపోయాయని కూడా తెలిసీ యిలా మాట్లాడుతున్నారే?

అక్కణ్ణించి వచ్చేసిన తరువాతే, పెదనాన్నగారికి తెలిసిన పి.బన్సల్ గారి ఆఫీసులో ఉద్యోగం యిప్పించింది అమ్మ. నెలకు రెండువేల జీతం. ఈ ఉద్యోగం వుండడం వల్లే, శౌభిక్ నుంచీ భరణం కోసం ప్రయత్నించలేదు నేను. కూతురి కోసం మనసు ఆరాటపడినప్పుడు శౌభిక్‌కు ఫోన్ చేస్తాను. అతను చాలా బాగా మాట్లాడుతాడు. నా వివరాలన్నీ తెలుసుకుంటాడు. కానీ రుపాయి గురించి అడగాలంటే మాత్రం నా గొంతులో యేదో అడ్డంపడ్డట్టవుతుంది. తల్లినై వుండి, నా కూతురి పట్ల ఏ బాధ్యతా నిర్వహించలేకపోయిన తరువాత, యింక తన మంచీచెడ్డా గురించి తెలుసుకునే అధికారం నాకెక్కడిది?

ఈ వ్యథ నాకు మాత్రమే చెందింది. ఎవరి దగ్గరా చెప్పుకోలేనిది. శౌభిక్ యింటివాళ్ళంతా బాగా చదువుకున్నవాళ్ళు. మర్యాదస్తులు. అంతకుమించి ఉదార స్వభావం గలవాళ్ళు. నాపై దయ చూపించి, క్షమించగలవాళ్ళు కూడా! కానీ ఒకటిన్నర సంవత్సరం కూతురిని విసిరేసి వచ్చానే! ఇప్పుడు ఆరేళ్ళుంటాయి. తన ముందెలా నిలబడగలను?

ఈ రోజంతా సోనా పెద్దమ్మ వాళ్ల యింట్లోనే గడిచిపోయింది. కానీ పడుకోవడానికైతే పట్టుపట్టి యింటికే వచ్చేశాను. ఒంటరిగా పడుకోవడం మంచిదికాదని కాబోలు, పెద్దమ్మ రాజూ వాళ్ళమ్మను తోడు పంపింది – బలవంతంగా. దయ్యం భయంతో రామనామజపం చేస్తూ, వరండాలోనే నిద్రపోయిందా మహాతల్లి! యింట్లోకి రాగానే నేను ఉలిక్కిపడ్డాను. ఇదేంటి! ఆ మూల కూర్చుని వుండెవరు? రుపాయి నేనా? తనిక్కడికెలా వచ్చింది? గాజు కిటికీలోంచి వచ్చే వెలుగులో స్పష్టంగా రుపాయిని చూస్తున్నాను. అదుగో రుపాయి కూర్చుని వుంది. లైటువేసి చూస్తే, యిల్లంతా ఎవరో సర్దిపెట్టినట్టే వుందేమిటి? పడక కిందినుంచి రుపాయి ఆట వస్తువుల పెట్టె, బొమ్మలు తీసి ఓ మూల పెట్టి వున్నాయి.

ఇరవై నాలుగ్గంటల తరువాత, నేను, మొట్టమొదటిసారి, నా అస్తిత్వం తాలూకు కృత్రిమ అవయవాల ముందు – మనసారా ఏడ్వటం మొదలెట్టాను.